నయీమ్ కాసేపు తల్లివైపూ.. భార్యవైపూ.. ఆమె చేతుల్లో ఉన్న పిల్లాడివైపూ మార్చిమార్చి చూశాడు.

''నాకు ఏం చెప్పాల్నో తోస్తలేదు. దిమాక్ పని జేస్తలేదు'' అన్నాడు రెండుచేతుల్లో తల పెట్టుకుని.

''వాడేం జెప్తడు? వాడు రాజ్యం ఇడిశిపెట్టి ఏడ్నో ఉండబట్టె! వాడు ఈడ్నే ఉండి సూస్తె ఎరుకయ్యేటిది! అట్ల వానికి కండ్లపడ్తె.. చీరి ఉప్పుకారం పెట్టెటోడు! వానికీ పిల్లవొద్దు!'' అన్నది అక్కసుగా రసూల్‌బీ.


''నువ్వుమటుకు జూసినవా పుప్పూ! నిజంగ జెప్పు! అల్లాకీ కసమ్!'' అన్నాడు అన్వర్.

''ఛుప్! చిన్నపోరనివి. నీకేం ఎర్కని మాట్లాడుతానవ్? గమ్మునుండు''.. అన్వర్‌ని కసిరింది రసూల్‌బీ.

''మా బెహెన్‌కి గింత అన్యాలం జరుగుతుంటె నేనూ కుంటనా? చిచ్చా.. మీరడుగున్రి!'' అంటూ అఫ్జల్ పాషా వైపు చూశాడు అన్వర్.

ఆగమన్నట్టు సైగచేశాడు అఫ్జల్. అతనికి రసూల్‌బీ వదిన వరసవుతుంది. ఆమె సంగతంతా తెలుసు. అఫ్జల్ మూడుసార్లు మక్కా వెళ్లివచ్చాడు. నిజాయతీగా, నిక్కచ్చిగా ఉంటాడు. మిగతా పెద్దమనుషులంతా అతని మాటను గౌరవిస్తారు.

అఫ్జల్ ఓసారి రసూల్‌బీ వైపు చూశాడు. కోడల్ని ఎలాగైనా తరిమేయాలన్న పట్టుదలతో



ఉన్నట్టుంది. అటు చూస్తే నయీమ్.. మంచి వాడే గానీ తల్లిమాట జవదాటలేడు. వచ్చేముందే ఆ ఇంటి విషయాలన్నీ తెలుసుకున్నాడు అఫ్జల్.

* * *

రసూల్‌బీ తండ్రి దూది ఏకి పరుపులు కుట్టేవాడు. దానిమీద ఆదాయం అంతంత మాత్రంగానే ఉండేది. ఇద్దరుపిల్లలు చిన్నగా ఉన్నప్పుడే టీబీవచ్చి చచ్చిపోయాడు. బంధువులెవరూ దగ్గరికి రానివ్వలేదు. తినడానికి గుప్పెడు గింజలు దొరక్క.. చెప్పలేనన్ని బాధలుపడింది రసూల్‌బీ తల్లి ఫరీదా. మెరిగెలూ, పరిగెలూ ఏరుకోవడానికి కళ్లాల చుట్టూ తిరిగేది. ఎవరేం పనిచెపితే.. అది చేసేది. నాట్లూ – కలుపులూ, కోతలూ – నూర్పిళ్లూ.. అన్ని వ్యవసాయ పనులూ నేర్చుకుంది. ఆ పనులు లేనప్పుడు తాపీమేస్త్రీల దగ్గర కూలికి వెళ్లేది. రైస్ మిల్లుల్లో హమాలీ పనికి వెళ్లేది. కొడుకునూ, కూతుర్నీ ఏమాత్రం గారాబం చేయకుండా.. చిన్నప్పట్నుంచీ పని నేర్పుతూనే పెంచింది. తనూ.. పిల్లలు చేసిన కష్టంతో డబ్బులు కూడబెట్టి, రెండెకరాల పొలం కొన్నది. కొడుకు సుతారి పని నేర్చుకుని బాగానే పొదుపుచేశాడు. ఫాతిమా, సఫియా, అన్వర్ పుట్టగానే అతని భార్య చనిపోయింది. మళ్లీ పెళ్లి చేసుకుంటే రెండోభార్యకు కూడా ఇద్దరు పిల్లలు కలిగారు. అతని మీదా, అతని సంపాదన మీదా రెండోభార్య ఎప్పుడైతే పట్టుసాధించి పెత్తనం సాగించడం మొదలుపెట్టిందో.. ఫరీదా కొడుకును దూరంపెట్టడం ప్రారంభించింది.

అంతకుముందే, రసూల్‌బీకి పక్కూరి జమాలుద్దీన్‌తో పెళ్లిచేసి.. కూతుర్నీ అల్లుణ్నీ తనదగ్గరే పెట్టుకుంది ఫరీదా. అల్లుడు ఉత్త బద్ధకస్తుడు. రసూల్‌బీపై ప్రేమగానే ఉన్నా.. ఇరవై నాలుగ్గంటలూ తినికూర్చోవడం తప్ప, మరేమీచేయడు. అతణ్ని దారిలోకి తేవడానికి ఫరీదా ఎంతో ప్రయత్నించింది గానీ లాభం లేకపోయింది.

ఈలోగా నయీమ్ పుట్టాడు. వ్యవసాయం పనులు ఎటూరావని రైస్‌మిల్‌లో బస్తాలు మోసే పనికి కుదిర్చి, స్వయంగా దగ్గరుండి పంపిస్తే.. కొంచెంసేపటి తర్వాత బస్తాల చాటున పడుకుని నిద్రపోయేవాడు జమాలుద్దీన్. ఎన్నో ప్రయత్నాలు చేసి విసిగిపోయిన ఫరీదా.. పెద్దమనుషులతో పంచాయతీ పెట్టించి, కూతురికి తలాక్ ఇప్పించేసింది.

రసూల్‌బీకి భర్త జమాల్‌పై ప్రత్యేకమైన ప్రేమలేకపోయినా పెద్దగా ద్వేషమేమీ లేదు. మంచి వయసులో ఉన్నప్పుడు భర్తకు దూరమవడం, తీరికలేని పని, సంపాదన.. వీటితో తెలియకుండానే డబ్బుయంత్రంగా మారినా, ఏమూలో అందరిలాగా తనూ భర్తతో ఉంటే బాగుండుననే కోరిక ఉండేది. తల్లంటే విపరీతమైన భయం.. పని చేసేచోట తనంటే శ్రద్ధచూపే వీరయ్య అంటే ఇష్టం.. అతనికి దగ్గరయ్యేలా చేశాయి.

చాన్నాళ్లకు గానీ కూతురి విషయం తెలియలేదు ఫరీదాకు. అప్పటికే చేయి దాటిపోయింది. చేసేదేమీలేక నోరు మూసుకుంది. రసూల్‌బీ కొడుకు నయీమ్‌కు అటు చదువ్వూ, ఇటు పనీ అబ్బలేదు. తాపీమేస్త్రీ దగ్గర కుదిరిస్తే.. పని బాగా నేర్చుకుని, పెద్దమేస్త్రీ అయి సంపాదిస్తాడనుకుంటే.. ఎన్నాళ్లయినా తట్టలు మోయడం, సిమెంట్ కలపడం తప్ప ఎదుగూబొదుగూ లేదు.

ఈలోగా తను చచ్చిపోయేముందు మనవడి పెళ్లి చూడాలనీ, అదికూడా కొడుకు కూతురు సఫియాతోనే పెళ్లి జరిపించాలని గట్టి పట్టుపట్టింది ఫరీదా. ఆ పేరుతో కొడుకు డబ్బుతో కొన్న పొలం.. బయటివాళ్లకు ఇవ్వక్కర్లేకుండా ఉంటుందని ఆమె ఆలోచన.

అసలే తల్లిలేని పిల్ల. సవతితల్లి సరిగా చూట్టంలేదు. తన చెల్లి కొడుకును చేసుకుంటే.. అక్కడైనా సుఖంగా ఉంటుందనీ, పొలం ఎట్లాగూ ఫరీదా చేతిలోనే ఉందిక దాని.. పెళ్లికి ఒప్పుకొన్నాడు ఫరీదా కొడుకు. అదివరకే ఫాతిమా పెళ్లయింది. అప్పటికి సఫియా పదో తరగతి చదువుతున్నది. మంచిమార్కులతో పాసై ఇంకా చదువుకోవాలని ఇష్టంగాఉన్నా.. నిస్సహాయుడైన తండ్రికోసం ఆమె రాజీపడింది.

పదహారేళ్లకే ఓ ఆడపిల్లకు తల్లి అయిన సఫియా.. మరో రెండేళ్లకు ఇంకో ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈలోగా ఫరీదా చనిపోయింది. ఇంటి పెత్తనం అంతా చేతికివచ్చిన రసూల్‌బీ.. అచ్చు తనతల్లిలాగే ప్రవర్తించసాగింది. నలుగుర్లోనూ కొడుకు గొప్పగా ఉండాలనే కోరిక తీరే మార్గాలు వెతకసాగింది.

'ఇద్దరు ఆడి సైతాన్లను కన్నవ్. ఇల్లెట్ల గడుస్తది.. పని చేసేటిది లేదు, రూపాయ్ సంపాదించేటిది లేదు, తిండికి మటుకు బరాబర్!' అంటూ సూటిపోటి మాటల్తో సఫియాను తిట్టడం మొదలుపెట్టింది.

ఆ మాటలు పడలేక కొన్నాళ్లు వ్యవసాయకూలీగా పని చేసిన సఫియా.. పిల్లలు కొంచెం పెరుగుతుండగానే టైలరింగ్ నేర్చుకుని, ఊరివాళ్ల బట్టలు కుట్టడం మొదలుపెట్టింది. ఈలోగా రసూల్‌బీ తనకు అక్కవరుస అయిన రుక్సానా కొడుకులు మస్కట్ పోయి, బాగా సంపాదించి ఇళ్లూ పొలాలూ కొన్నారని తెల్సుకుని.. వాళ్లను బతిలాడీ బామాలీ బోలెడు డబ్బులు ఖర్చుపెట్టి.. ఏజెంట్ ద్వారా కొడుకును మస్కట్ పంపే ప్రయత్నాలు చేసింది.

తల్లినీ, భార్యాపిల్లల్నీ వదిలి వేరే దేశం పోవడానికి పాతికేళ్ల నయీమ్ ఇష్టపడలేదు. కానీ, బోలెడు డబ్బులు ఖర్చుపెట్టాననీ, అక్కడ పెద్దమ్మ పిల్లలు పని ఇప్పిస్తానన్నారనీ, పరిస్థితులు కొంచెం మెరుగుపడ్డాక వీళ్లను తీసుకుపోవడమో.. బాగా సంపాదించాక వెనక్కి వచ్చేయడమో చేయొచ్చనీ సర్దిచెప్పింది తల్లి.

నయీమ్ వెళ్లే తేదీ దగ్గరపడ్డాకే.. సఫియాకు విషయం తెల్సింది. ఆమె ఖిన్నురాలైంది. తల్లినీ, తననూ, ఇద్దరు ఆడపిల్లలనూ వదిలి అక్కడికివెళ్లి అతనేం చేయగలడో ఆమెకు అర్థంకాలేదు. అదే విషయం అడిగితే.. అతను కన్నీళ్లు పెట్టుకున్నాడు.

''అమ్మీ చెప్పింది ఇనకపోతే నారాజ్ అయితది. ఏడుస్తది. చిన్నప్పట్నుంచీ నామీదనే జాన్ అన్నట్టు బతికింది. కొన్నిదినాలు అయినంక.. ఆడ ఉండనిస్తలేరనీ, ఎల్లగొడుతాన్రనీ జెప్పి వచ్చేస్త!'' అన్నాడు.

తీరా వెళ్లే ముందుకూడా..

''గుబులైతాంది సఫీ! అందర్నీ వదిలిపెట్టి పోబుద్ధయితలేదు!'' అంటూ కన్నీళ్లు పెట్టుకున్న భర్తను ఏమనాలో సఫియాకు తోచలేదు.

ఈ తొమ్మిదేళ్లలో ఆరేడుసార్లు వచ్చివెళ్లాడు. క్రితంసారి వచ్చివెళ్లిన ఏడాదికే కొడుకు పుట్టాడని మళ్లీవచ్చాడు. ఇప్పుడు.. ఈ కష్టం!!

* * *

సఫియా ఆలోచనలో ఉండగానే..

''ఎందుకు భాబీ! ఆ పిల్లమీద అనుమానమొచ్చింది నీకు?'' అని రసూల్‌బీని అడిగాడు అఫ్జల్.

అదాటున అడిగేసరికి ఒక్క క్షణం తొట్రుపడింది రసూల్‌బీ. తన అనుభవంతో ముఖంలోని తొట్రుపాటును కనబడకుండాచేసి..